క్లుప్తంగా

సెలవు దినాల్లో తరగతుల నిర్వహణ తగదు

టెక్కలి: ప్రభుత్వం సెలవు దినాలుగా ప్రకటించిన రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ప్రతినిధులు కె.మురళి, శ్యామ్, వెంకి, దుర్గా, ఆర్య కోరారు. పలుమార్లు అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ టెక్కలి పట్టణంలో పలు ప్రైవేట్ విద్యా సంస్థలు తమ ఇష్టారాజ్యంగా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. సెలవు దినాల్లో విద్యా సంస్థలకు రాని విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షల్లో మార్కులు తగ్గిస్తామని బెదిరిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితురాలికి సాయం



బాధితురాలికి సాయాన్ని అందజేస్తున్న రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: పురపాలకసంఘం పరిధిలోని త్రినాథపేటకు చెందిన అగ్నిప్రమాద బాధితురాలు జి.లక్ష్మికి మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సూచన మేరకు 12, 13 వార్డులకు చెందిన మహిళాసంఘ సభ్యులు అండగా నిలిచారు. 175 కేజీల బియ్యం, కూరగాయలు, నాలుగు వేలు రూపాయలను సమకూర్చారు. వీటిని చైర్‌పర్సన్ రాజలక్ష్మి ద్వారా బాధితురాలికి ఆదివారం అందజేశారు.

నేడు బెండిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వజ్రపుకొత్తూరు: బెండి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు ఆదివారం తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో మంత్రి సీదిరి అప్పలరాజు పాల్గొంటారన్నారు.

30 మందికి ఉచితంగా నేత్ర శస్త్రచికిత్సలు

మందస: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 30 మంది పేదలకు గాయత్రి చారిటబుల్ ట్రస్టు ఉచితంగా నేత్ర శస్త్రచికిత్సలను చేయించింది. ట్రస్టు చైర్మన్ కొర్ల కన్నారావు ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ వైద్య విజ్ఞాన్ సంస్థ ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించారు. వీరిని ఆస్పత్రి నుంచి ఆదివారం హరిపురం వరకు తీసుకువచ్చి.. వారి ఇళ్లకు క్షేమంగా దిగబెట్టారు. మందులు, ఇతర ఖర్చులు, మళ్లీ కంటి తనిఖీలు ట్రస్టు భరిస్తుందని కన్నారావు చెప్పారు.

డీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీకి సంబంధించి డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా చింతాడ పార్వతీశ్వరరావు, కో-కన్వీనర్‌గా పూజారి రమణమూర్తిలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోత ధర్మారావు మాట్లాడుతూ.. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, విద్యారంగంలో నెలకున్న చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న యువకులు

సంతబొమ్మాళి: మండల కేంద్రం సంతబొమ్మాళి గ్రామానికి చెందిన ఎనిమిది నెలల చిన్నారి అనంతు రుక్మిణి కళ్లకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న సంతబొమ్మాళికి చెందిన యువకులు సోషల్ మీడియా ద్వారా పలు సంఘాలు, దాతల నుంచి రూ. 38,400 సేకరించారు. ఈ మొత్తాన్ని చిన్నారి రేణిక వైద్య ఖర్చుల నిమిత్తం ఆమె తల్లికి ఆదివారం అందజేసి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి యువజన సేవా సంఘం ప్రతినిధులు అట్టాడ సాయికుమార్, గాయిత్రీ, మల్లేష్, దేవా, శశి, ధను, భగవాన్ ఉన్నారు.

బ్రిడ్జి పనులు చేపట్టాలి

సోంపేట: పలాసపురం రహదారి బ్రిడ్జి పనులు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద ఇంజినీరింగు అధికారులను కోరారు. ఏఈ ధనుంజయరావు పలాసపురం రహదారిని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు యశోద, సర్పంచ్ తడక జోగారావు ఆయన్ని కలిసి రహదారిలో బ్రిడ్జి లేక తలెత్తుతున్న ఇబ్బందులను వివరించారు. అలాగే బారువ-సోంపేట రహదారి నుంచి లక్కవరం మీదుగా జాతీయ రహదారి అనుసంధానం చేస్తూ మధ్యలో నిలిపి వేసిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు.

చంద్రబాబు అరెస్టు సరైనదే

- వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



మందస: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మందస: టీడీపీ ప్రభుత్వం హయాంలోనే ఎక్కువగా కుంభకోణాలు జరిగాయని, అప్పుడు చేసిన పాపాలకు నేడు ఆ పార్టీ నాయకులు శిక్ష అనుభవిస్తున్నారని ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, జిల్లా కార్యదర్శి దల్లి జానకిరావురెడ్డి, సచివాలయాల కన్వీనర్ చింతాడ గణపతి అన్నారు. మందసలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబు ఆర్థిక నేరాలకు పాల్పడడంతోనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. సీఐడీ చంద్రబాబును అరెస్ట్ చేయడం సక్రమమేనన్నారు. కేవలం సానుభూతి కోసమే టీడీపీ శ్రేణులతో పాటు పచ్చమీడియా రోడ్డెక్కుతున్నాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పోలీసులు కాపాడుతున్నారన్నారు. టీడీపీ, దత్తపుత్రుని శ్రేణులు ఆలోచించుకోవాలని, సామాన్యుడెవ్వరూ ఈ సంఘటనపై ఎటువంటి వ్యాఖ్యలు చేయడం లేదన్నారు. తనను అరెస్ట్ చేస్తారని చేసిన తప్పును ముందుగానే ఊహించుకుని చంద్రబాబు చెప్పడం మొదలెట్టారన్నారు. రూ.కోట్లు స్వాహా చేసిన నాయకులు శిక్ష అనుభవించక తప్పదన్నారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన చంద్రబాబు ఆర్థిక నేరాలకు పాల్పడ్డారన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన చంద్రబాబుకు వేల రూ.కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, రాజ్యాంగానికి లోబడి ఉండాల్సిందేనన్నారు. జనసేన పార్టీ నాయకుపు పవన్ కల్యాణ తీరుమార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కంచిబెహరా, పార్టీ సీనియర్ నాయకులు గిన్ని తిరుపతిరెడ్డి, చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, కొండల ఢిల్లేశ్వరరావు, నాగేశ్వర బృందావన్, బాడ సూరన్న, పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, పార్టీ నాయకులు సవర నీలకంఠం, దువ్వు జగదీష్, తలగాన హరికృష్ణ, బి.రవికుమార్, సంతోష్, గణేశ్ ఉన్నారు.

'చంద్రబాబు స్కాముల్లో స్కిల్ ఉన్న ఘనుడు'



వజ్రపుకొత్తూరు రూరల్: మాట్లాడుతున్న పార్టీ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: స్కాములు చేయడంతలో స్కిల్ ఉన్న ఘనుడు చంద్రబాబు అని.. ప్రజాధనాన్ని దోచుకుని దాచుకోవడమే ఆయన నైజమని వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతు వెంకటరావు దొర, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, మండల అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యానాయుడు అన్నారు. వజ్రపుకొత్తూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉందని చెప్పుకున్న చంద్రబాబు తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆరోపించారు. ఇప్పటికే ఓటుకు నోటు, అమరావతి నిర్మాణం, భూముల సేకరణ, నీరు-చెట్టు కుంభకోణాలతో పాటు అనేక అక్రమాలలో ఆరితేరిన ఘనుడు చంద్రబాబు అన్నారు. ఆయన చేసిన అనేక దోపిడీల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం ఇప్పుడు వెలుగులోకి వచ్చిందన్నారు. తప్పుచేసి అడ్డంగా దొరికిన టీడీపీ నేతలు ఊసరవల్లిలా రంగులు మార్చుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడుతోందంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కక్ష సాధింపు జగనన్న నైజం కాదన్నారు. న్యాయ వ్యవస్థలో అందరూ సమానమేనన్నారు. చట్టం ఎవరికీ చుట్టం కాదన్నారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందన్నారు. భారీ స్కాంలో అరెస్టయిన చంద్రబాబుపై దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ చూపిస్తున్న ప్రేమ, ఆరాటం చూస్తుంటే ప్యాకేజీ స్టార్ అని మరోసారి రుజువు అయిందన్నారు. ప్రజలు వివేకంతో అంతా గమనిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలను తరిమి కొడతారని అన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు మామిడి భాస్కరరావు, కొల్లి భాస్కరరావు, సచివాయ కో-ఆర్డినేటర్ వడ్డి కరుణాకర్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినాన శాంతారావు, నాయకులు జోగి అప్పారావు, గూడ ఈశ్వరరావు, బత్తిని లక్ష్మీనారాయణ, తిర్రి రాజారావు, ఇప్పిలి అప్పన్న ఉన్నారు.

న్యాయమే గెలిచింది

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ఏసీబీ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడం సబబేనని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తప్పు చేసిన వారు ఎంతటి ఘనులైనా శిక్ష తప్పదని.. చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. కుంభకోణాల చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించడంతో న్యాయం గెలిచిందని నిరూపణ అయిందన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన మిగిలిన టీడీపీ నాయకులను కూడా విచారించి శిక్షపడేలా చూడాలని డిమాండ్ చేశారు.

అందరూ సమానమే



చట్టం ముందు అందరూ సమానమే. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు చేసిన అవినీతిలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఒకటి. తప్పు చేశారు కాబట్టే సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. చంద్రబాబు అరెస్టు న్యాయబద్ధమే.

– సల్ల సుగుణ, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం

ప్రజాస్వామ్యం గెలిచింది



చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించడంతో ప్రజాస్వామ్యం గెలిచినట్టైంది. స్కిల్ డెవలప్‌మెంట్‌లో చోటు చేసుకున్న కోట్లాది రూపాయల కుంభకోణంతో చంద్రబాబు పాపం పండింది. చట్టం ముందు అందరూ సమానమే. ఆర్థిక నేరగాళ్లను కోర్టులు ఉపేక్షించవు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష తప్పదు. టీడీపీ చరిత్ర ముగిసింది.

-పాలిన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు

జీవితాలను నాశనం చేశారు



ఎంతో మంది జీవితాలను నాశనం చేసిన చంద్రబాబుకు దేవుడు సరైన సమయంలో శిక్ష విధించాడు. పోలవరం, అమరావతి, ఐటీ, ఈఎస్ఐ మందులు, అమరావతి భూ కుంభకోణం అన్ని కేసులూ ఆయన్ని వెంటాడుతాయి. చాలా మంది జీవితాలతో చంద్రబాబు ఆడుకున్నాడు. కోర్టు తీర్పుతో ఎంతటి వారైనా సమానమని నిరూపితమైంది. చట్టానికి లోబడే ప్రతిఒక్కరూ పని చేయాలి.

– తమ్మినేని శ్రావణి, వైస్ ఎంపీపీ, వజ్రపుకొత్తూరు

ఎన్టీఆర్ ఆత్మకు శాంతి చేకూరింది



చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించడంతో మాజీ ముఖ్యమంత్రి.. దివంగత నందమూరి తారక రామారావు ఆత్మకు శాంతి చేకూరింది. ఎన్టీఆర్‌కు పెట్టిన క్షోభను నేడు చంద్రబాబు అనుభవిస్తున్నారు. చట్టం తన పని చేసుకుని పోయింది. ఇందులో ప్రభుత్వ ప్రాత ఉందని టీడీపీ నాయకులు విమర్శలు చేయడం హాస్యాస్పదం.

-నిమ్మన దాస్, ఎంపీపీ, సోంపేట

చట్టానికి అందరూ సమానమే



చట్టం దృష్టిలో అందరూ సమానమే. చంద్రబాబు తప్పుచేశారు కాబట్టే కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది. తప్పు చేసినవారు తప్పకుండా శిక్షణను అనుభవిస్తారు. నన్ను ఏమి చేయలేరు.. నన్ను ముట్టుకోలేరు వంటి డైలాగులకు కాలం చెల్లింది.

– పి.వెంకటసతీష్, ఏఎంసీ చైర్మన్, పలాస

న్యాయానిదే అంతిమ విజయం



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబుకు ఏసీబీ కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడం ప్రజా గెలుపే. కోర్టు తీర్పుతో టీడీపీ నాయకుల్లో వణుకు మొదలైంది. చంద్రబాబుది నీచమైన చరిత్ర. ఎప్పటికైనా అంతిమ విజయం న్యాయం, ప్రజా పక్షానే ఉంటుంది.

–ఉప్పరపల్లి నీలవేణి, ఎంపీపీ, వజ్రపుకొత్తూరు

అందరినీ విచారించాలి



చంద్రబాబు విషయంలో ముమ్మాటికీ న్యాయమే గెలిచింది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అవినీతికి పాల్పడితే అది న్యాయం అన్నట్లు టీడీపీ నాయకులు చేస్తున్న హంగామా చూస్తుంటే బాధగా ఉంది. చంద్రబాబు అరెస్టును ప్రజలు ఎవ్వరూ పట్టించుకోవడంలేదు. అవినీతితో సంబంధం ఉన్న టీడీపీ నాయకులందరినీ విచారించాలి.

– బోర పుష్ప, ఎంపీపీ, ఇచ్ఛాపురం

పాపం పండింది



యువతకు నైపుణ్యాల అభివృద్ధి పేరుతో అక్రమ మార్గాన ప్రభుత్వ సొమ్ములు కాజేసిన చంద్రబాబుకు కోర్టు రిమాండ్‌కు పంపిడంతో న్యాయం గెలిచినట్లు అయింది. వ్యవస్థలను మ్యానేజ్ చేస్తూ 26 కేసుల్లో స్టేలు తెచ్చుకొని నిప్పునని చెప్పే బాబుకు పాపం పండే రోజు వచ్చింది. చట్టానికి అతీతుడనే భావనలో ఉన్న చంద్రబాబుకు చట్టం అందరికీ సమానమని కోర్టు నిరూపించింది. ఇదే కేసులో ఏ-2గా ఉన్న అచ్చెన్నాయుడును కూడా అరెస్టు చేస్తే మరిన్ని నిజాలు బయటకు వస్తాయి.

–పేరాడ తిలక్, కళింగ కార్పొరేషన్ చైర్మన్

బై.. బై.. బాబూ..



స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం రూపకర్త చంద్రబాబే. పక్కా ఆధారాలతో సీఐడీ దీన్ని నిరూపించింది. చంద్రబాబుకు రిమాండ్ విధిస్తూ సీఐడీ కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకం. నేను నిప్పు, తప్పు చేయలేదు అని చెప్పుకునే చంద్రబాబు నేడు జైలు ఊచలు లెక్కపెడుతున్నారు. ఏపీ ప్రజలు బై.. బై.. బాబూ అంటూ ఆయన రాజకీయ జీవితానికి వీడ్కోలు పలుకుతున్నారు.

– హనుమంతు వెంకటరావు దొర, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు

చట్టానికి ఎవరూ చుట్టం కారు



చట్టానికి ఎవరూ చుట్టం కారు. అవినీతికి పాల్పడేవారు చట్టం నుంచి తప్పించుకోలేరు. ఈ విషయం చంద్రబాబు విషయంలో రుజువైంది.

–పైల దేవదాస్‌రెడ్డి, ఎంపీపీ, కంచిలి

సొండిపూడి విద్యార్థికి బంగారు పతకం

మందస:

సొండిపూడి గ్రామానికి చెందిన బడియా దినేష్‌కుమార్ గోల్డ్‌మెడల్ సాధించారు. విశాఖలోని ఆంధ్రాయూనివర్సిటీలో 2018-2020వ సంవత్సరంలో మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎంఎల్ఐఎస్సీ) చేశారు. దినేష్‌కుమార్ మంచి ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించడంతో వీసీ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నారు.



ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి నుంచి గోల్డ్‌మెడల్ అందుకుంటున్న దినేష్‌కుమార్

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

ఇచ్ఛాపురం రూరల్: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ ప్రచారక్ డి.రాజశేఖర్‌జీ అన్నారు. ఈదుపురం, లొద్దపుట్టిలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధర్మ సంస్కృతుల పరిరక్షణకు కృషి చేస్తూ వ్యక్తులలో దేశభక్తి, శీల సంపద, సామాజిక స్పృహ, సేవా సమర్పణ, భావజాలాలను నిర్మాణం చేస్తూ 98 సంవత్సరాలు హిందూ సంఘటనా కార్యాన్ని చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలతో ఖండ కార్యవాహ నిర్వహించారు. కార్యక్రమంలో లేటి సత్యం, బల్లెడ యాజ్ఞానందం, బడే లోక్‌నాథం, పండి అనీల్‌కుమార్, డొంకాన ఢిల్లేశ్వరరావులు పాల్గొన్నారు.



ఈదుపురంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌జీ

సింహద్వారం ప్రతిష్ట

కంచిలి: పెద్ద శ్రీరాంపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సింహద్వారం ప్రతిష్టా మహోత్సం ఆదివారం ఘనంగా జరిగింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, జేసీఎస్ అధ్యక్షుడు కొనపల సురేష్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు యారాడి ఆనంద్, పీఏసీఎస్ అధ్యక్షులు గుమ్మిడి రాందాస్, సర్పంచ్ బల్లెడ సుమన్, పార్టీ నాయకులు ఇప్పిలి క్రిష్ణారావు, కొల్లి ఈశ్వరరావు, దుర్గాసి ధర్మారావు పాల్గొన్నారు.



సింహద్వారాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు

సంగీత కళాకారులకు సత్కారం

ఇచ్ఛాపురం రూరల్:

చిరు ప్రాయంలోనే సంగీతంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మాస్టర్ చలపరాయి చాణిక్య జాతీయ స్థాయిలో ప్రదర్శనలిచ్చే స్థాయికి ఎదగాలని సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి అన్నారు. టి.బరంపురం సీతారాముల ఆలయంలో ఆదివారం జరిగిన ఉత్సవ కార్యక్రమంలో సంగీత కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మృదంగం విభాగంలో చెన్నైలో నిర్వహించిన కర్ణాటక మ్యూజికల్ టాలెంట్-2023 పోటీల్లో చాణిక్య ద్వితీయ స్థానంలో నిలవడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా చాణిక్యను దుశ్శాలువ, మెమెంటో, ప్రశంసా పత్రంతో సత్కరించారు. సంగీత కళాకారులు తిప్పన ధనుంజయరెడ్డి, దక్కత మోహనరావు, చలపరాయి వినోద్, ఏదురు కేధారి, దక్కత వాసు, నాగిరెడ్ల మాదయ్య, చలపరాయి రవికుమార్ పాల్గొన్నారు.



చాణిక్యను సత్కరిస్తున్న దృశ్యం

అభివృద్ధికి ప్రాధాన్యం

కంచిలి: గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. ఎం.ఎస్.పల్లి గ్రామ సచివాలయ పరిధిలో పంచాయతీ సాధారణ నిధులతో నిర్మించిన ప్రజా విశ్రాంతి మండపాన్ని సర్పంచ్ కొనపల సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బుద్దెపు విశ్వనాథ్‌రెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ లడ్డు కేశవ్ పాత్రో, పీఏసీఎస్ చైర్మన్ గుమ్మిడి రాందాస్, పార్టీ నాయకులు దుర్గాసి ధర్మారావు, పైల లక్ష్మీనారాయణ, పైల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



విశ్రాంతి మండపాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి సంతాపం

కవిటి: కవిటికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పొల్లాయి దానయ్యనాయుడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ గ్రామానికి చేరుకొని దానయ్యనాయుడు అంత్యక్రియల్లో పాల్గొని పాడిమోశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.



దానయ్యనాయుడు అంతిమయాత్రలో సాయిరాజ్

నూతన పింఛన్లు పంపిణీ



ఇచ్ఛాపురం రూరల్: మండపల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శశిరేఖ

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి, తులసిగాం పంచాయతీల్లో పలువురికి మంజూరైన నూతన పింఛన్లను సర్పంచ్‌లు పిట్ట శశిరేఖ, రోకళ్ల పార్వతిలు ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిట్ట మామయ్యరెడ్డి, ఇసురు తులసీరాం, మరడ వలసయ్యలు పాల్గొన్నారు.

యూవీవీ గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ



పుస్తకాలను అందజేసిన లక్ష్మణరావుతో యూవీవీ ప్రతినిధులు

పలాస: ఉద్దానం ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యూవీవీ) ఆధ్వర్యంలో నీలావతిలో నడుస్తున్న గ్రంథాలయానికి 300 పుస్తకాలను పాత్రుని లక్ష్మణరావు వితరణగా అందజేశారు. ఉద్దానం ప్రాంతంలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న ఉపాధ్యాయులు ఈ గ్రంథాలయానికి అనేక విధాలుగా సహకరిస్తున్నారు. అందులో భాగంగానే లక్ష్మణరావు ఆదివారం పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో యూవీవీ ప్రతినిధులు కుత్తుం ప్రకాశరావు, తంగుడు ఖగేశ్వరరావు, లైబ్రేరియన్ పుష్పలత పాల్గొని లక్ష్మణరావును అభినందించారు.

రోటరీ సేవలు విస్తృతం చేస్తాం



రోటరీక్లబ్ అందజేసిన కుట్టుమిషన్లతో మహిళలు

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్ ద్వారా సేవలు విస్తృతం చేస్తామని అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ దినేష్‌కుమార్ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వంద మంది పేద మహిళలకు రూ. 8 లక్షలు విలువ చేసే కుట్టు మిషన్లు ఆదివారం పంపిణీ చేశారు. కుట్టుమిషన్లతో పాటు చీరలు, టోపీలు అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కుట్టుమిషన్లను వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యదర్శి పి.వి.కృష్ణారావు, కోశాధికారి కె.రవికుమార్, రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోష్మిత పండాకు డాక్టరేట్ ప్రదానం



ఏయూ వీసీ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న రోష్మిత పండా

కాశీబుగ్గ:పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 11వ వార్డు చిన్నబ్రాహ్మణవీధికి చెందిన రోష్మిత పండా ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ను పొందారు. 'భారతదేశంపై ప్రాంతీయ వాతావరణ అనుకరణ' అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ వచ్చింది. ఏయూ కాన్వకేషన్‌లో జరిగిన కార్యక్రమంలో వీసీ పి.వి.జి.డి ప్రసాద్‌రెడ్డి ఆమెకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు.



డాక్టరేట్ అందుకుంటున్న గణపతిరావు

తెలుగు ఉపాధ్యాయుడికి డాక్టరేట్..

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న మూల గణపతిరావుకు ఆంధ్ర యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రామతీర్థ సాహిత్యం-పరిశీలన అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

అగ్నికుల క్షత్రియ సంఘ భవనానికి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న వరప్రసాద్

కవిటి: జగతిలో అగ్నికుల క్షత్రియ సంఘ భవనానికి సర్పంచ్ పూడి వరప్రసాద్ ఆదివారం భూమిపూజ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.4 లక్షలు, గ్రామ పంచాయతీ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షలు వెచ్చించి భవనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ భావన రవి ఉన్నారు.

సీఎఫ్ బాధ్యతలు అప్పగించాలని వినతి

కోటబొమ్మాళి: కురుడు పంచాయతీ పాకివలస క్లస్టర్‌కు డ్వాక్రా సీఎఫ్‌గా తనను నియమిస్తూ ఆర్డర్‌కాపీ, బాధ్యతలు అప్పగించకుండా వెలుగు అధికారులు కాలయాపన చేస్తున్నారని పాకివలస గ్రామానికి చెందిన ముద్దాడ కమల వాపోయారు. ఈ విషయమై డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బింగు లక్ష్మి, అప్పటి ఏపీఎం పి.రామారావు, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చేతులమీదుగా ఆర్డర్ ఇప్పించారని వివరించారు. అయితే నేటివరకూ తనకు బాధ్యతలు అప్పగించలేదని.. న్యాయం చేయాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com